క్లుప్తంగా

చేపలవేటకు వెళ్లొద్దు



డోర్నకల్: డోర్నకల్ సమీపంలోని మున్నేరు వాగు పరిసరాల్లో చేపల వేట, సెల్ఫీలు దిగడడం, ఈత కొట్టడాన్ని నిషేధించినట్లు డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపారు. శుక్రవారం మున్నేరువాగును పరిశీలించిన సీఐ మాట్లాడారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్య తీసుకుంటామని హెచ్చరించారు.

లోతట్టు ప్రాంతాల్లో దిగొద్దు

బయ్యారం: బయ్యారం పెద్దచెరువు, జలపాతాలు చూసేందుకు వస్తున్న వారు లోతట్టు ప్రాంతాల్లో దిగొద్దని గార్ల–బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి సూచించారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు.

దరఖాస్తులు

నెల్లికుదురు: మండల కేంద్రంలోని కేజీబీవీ ఆశ్రమ పాఠశాలలో నూతనంగా ప్రవేశపెట్టిన అగ్రికల్చర్ క్రాప్ ప్రొటెక్షన్ కోర్స్‌కు సంబంధించిన 40ఖాళీల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి సుమలత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. పదో తరగతి పూర్తి చేసుకున్న బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో..

తొర్రూరు: స్థానిక కస్తూర్బా బాలికల కళాశాలలో ఇంటర్ ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్) కోర్సులో చేరేందుకు విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రత్యేకాధికారి బి. శైలజ తెలిపారు. నూతనంగా ఈ కోర్సును ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశపెట్టినట్లు, మొత్తం 40 సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పది పూర్తి చేసిన బాలికలు ఈ కోర్సులో చేరవచ్చన్నారు. ఈ కోర్సు ద్వారా ఆరోగ్య రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

మరిపెడ రూరల్: మరిపెడ మండలం గిరిపురం క్రాస్ రోడ్డులోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల ఇంటర్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఎంఈఓ అనితాదేవి తెలిపారు. వివరాల కోసం 88970 19492 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

డిగ్రీ ప్రవేశాలకు మరో అవకాశం

గార్ల: గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ప్రత్యేక విడత ప్రవేశాలను ఆసక్తి గల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజు కోరారు. శుక్రవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీస్ దోస్త్ ప్రత్యేక ప్రవేశాల కోసం ఈనెల 25 నుంచి 31 వరకు కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకొని బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు పొందగలరని ఆయన కోరారు.

రాష్ట్ర కార్యదర్శిగా గోపి



కేసముద్రం: మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మండల కేంద్రానికి చెందిన చందా గోపి నియామకమైనట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం చేతుల మీదుగా చందా గోపి నియామక పత్రాన్ని అందుకున్నట్లు పేర్కొన్నారు.

హాస్టళ్ల ప్రారంభానికి చర్యలు



నెహ్రూసెంటర్: ప్రభుత్వ మెడికల్ కళాశాల హాస్టళ్ల ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్మితమవుతున్న జీఎంసీ హాస్టల్, ఆసుపత్రి నిర్మాణ పనులను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. మరో వారంరోజుల్లోగా హాస్టళ్లను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో జీఎంసీ ప్రిన్సిపాల్ వెంకట్ లకావత్, మున్సిపల్ డీఈ ఉపేందర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

పెద్దవంగర: ప్రతి అర్జీపై తక్షణ చర్యలు తీసుకొని, సమస్యల పరిష్కారంలో జాప్యం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ గణేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి సందర్శించి, పలు రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, ఆర్ఐ లస్కర్ ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామ శివారులోని చంద్రుతండా సమీపంలో నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై వి.దీపిక శుక్రవారం రాత్రి తెలిపారు. విజయ్, నూర్ షా, పృథ్వీరాజ్, ఆంజనేయులు పేకాట ఆడుతుండగా పట్టుకుని వారి వద్ద నుంచి రూ.3,100 నగదు స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?

మహబూబాబాద్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు గుంతలమయంగా మారి క్రయవిక్రయదారులతోపాటు, పలు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డంతా బురదమయంగా ఉండడంతో పాదాచారులు కూడా నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డు నిర్మాణం చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు వినతులు ఇచ్చినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం శివారు తొర్రూరు రోడ్డులో కొన్ని సంవత్సరాల క్రితం గుట్టల మధ్య సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణం చేశారు. దానికి ప్రధాన రహదారి నుంచి కార్యాలయానికి సుమారు కిలోమీటరు దూరం ఉంటుంది. కాని పక్కా రోడ్డు నిర్మాణం చేయలేదు. కేవలం మట్టి రోడ్డు నిర్మాణం చేశారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం ఆ రోడ్డు అంతా గుంతలమయంగా మారుతుంది. దాంతో కార్యాలయానికి వెళ్లే క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

నెల్లికుదురు: మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామంలో ఆకేరు వాగు వరకు వెళ్లే రహదారి బురదమయమై నడవడానికి వీలు లేకుండా పోయినా పట్టించుకునే వారు కరువయ్యారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం బురదమయమైన రహదారిపై రైతులు వరినాటు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతులు బొల్లు మురళి, తాళ్ల ఆదిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బొల్లు రాములు పాల్గొన్నారు.



మహబూబాబాద్: బురదమయంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రోడ్డు



నెల్లికుదురు: బురద రోడ్డుపై నాటు వేసి నిరసన తెలుపుతున్న రైతులు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్

నర్సింహులపేట: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రూ.1.43కోట్ల నిధులతో నిర్మించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మానుకోట నుంచి వయా నర్సింహులపేట మీదుగా తొర్రూరుకు వెళ్లే ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలాయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అధికారులు పరిశీలించాలన్నారు. గంజాయిని అరికట్టాలని నర్సింహులపేటకు చెందిన శ్రీవాణి అనే మహిళ ఎమ్మెల్యేకు విన్నవించారు. గంజాయిపై నిఘా పెంచాలని ఎస్సైని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ రాధిక, ఎస్ఈ విద్యాసాగర్, డీఎం శివప్రసాద్, ఏఈ పాండు, రమేష్, రవీందర్‌రెడ్డి, రజినికాంత్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

కురవి/మరిపెడ/డోర్నకల్: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం ఆయా మండలాల్లో లబ్ధిదారులకు రేషన్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంల ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీఓ గౌస్, మండల అధ్యక్షులు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, అంబటి వీరభద్రంగౌడ్, చైర్మన్‌లు వెంకటరెడ్డి, సుధాకర్, నల్లు సుధాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి , యుగేందర్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, రఘువీరారెడ్డి, తాజుద్దీన్, వల్లూరి కృష్ణారెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, తహసీల్దార్ ఇమ్మానియల్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు మార్కెట్ చైర్మన్ సుధాకర్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్‌యాదవ్, జగదీష్ పాల్గొన్నారు.



నర్సింహులపేట: శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

మరిపెడ రూరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా అధ్యక్షురాలు బెస్త సంపూర్ణ అన్నారు. ఈమేరకు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్ల బీఎల్‌ఓల విధులను తక్షణమే రద్దు చేయాలన్నారు. బీఎల్‌ఓల విధులు, కుల గణనకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలన్నారు. అదేవిధంగా ప్రతీ నెల 5వ తేదీన అంగన్‌వాడీ టీచర్ల వేతనాలు చెల్లించాలన్నారు. పేరుకపోయిన పలు సమస్యలను పరిష్కరించేలని కోరారు. కార్యక్రమంలో స్నేహబిందు, జ్యోతి, లాలాబాయి, అనురాధ, లలిత పాల్గొన్నారు.



కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

బస్సు సౌకర్యం కల్పించాలి

నెహ్రూసెంటర్: పట్టణ శివారు అనంతారంలో పరిధిలో గల ఆదర్శ పాఠశాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

గార్ల: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ శారదకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సుందర్‌కుమార్, బాలాజీ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నెల్లికుదురు: విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే విధంగా రిసోర్స్ పర్సన్ ఇచ్చే శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు బోధించాలని ఎంఈఓ రామ్‌దాస్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంప్లెక్స్ సమావేశాల్లో ఎంఈఓ మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జీవన్ కుమార్, మంగతాయి, స్వప్న, ఆర్పీలు లక్ష్మీనారాయణ, మహేందర్, రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

'యూరియా కొరత ఉండదు'

గూడూరు: రైతులకు అవసరమైనంత యూరియా పీఏసీఎస్ ద్వారా అందించనున్నట్లు, ఎవరూ ఆందోళన చెందరాదని మండల వ్యవసాయాధికారి ఎండి.అబ్దుల్‌మాలిక్ అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌కు శుక్రవారం 40టన్నుల యూరియా రావడంతో ఒక్కసారిగా రైతులు క్యూ కట్టారు. దీంతో సమాచారం అందుకున్న ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి సిబ్బందితో చేరుకుని క్యూలో ఎవరూ ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

వాగుల పరవళ్లు.. చెరువుల మత్తళ్లు



డోర్నకల్: ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరువాగు



గూడూరు: అలుగు పోస్తున్న భూపతిపేట రాళ్ల చెరువు



కురవి: అలుగుపోస్తున్న బంచరాయితండా వద్ద ఉన్న చెక్‌డ్యాం

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండుకుంటున్నాయి. ఈ క్రమంలో చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు నిండుకొని శుక్రవారం అలుగు పోశాయి. దీంతో ఆయా చెరువు ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడ: గండి పడిన వీరేశం కుంట

మాలలు ప్రజాప్రతినిధులుగా ఎదగాలి



మాట్లాడుతున్న పిల్లి సుధాకర్

తొర్రూరు: మాలలు ప్రజాప్రతినిధులుగా ఎదిగేందుకు కృషి చేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ కోరారు. మాల మహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలో సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు చిట్టిమళ్ల మహేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సుధాకర్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మాలలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఎస్సీ వర్గీకరణ రోస్టర్ విధానం వల్ల మాలలకు నష్టం జరిగిందన్నారు. దళిత, బహుజనుల ఐక్యతకు మాలలు ముందంజలో ఉంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు యనమల రాకేష్, అనిల్, ప్రవీణ్, నీరుడి మహేష్, శివ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కేసముద్రం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇనుగుర్తి మండల కేంద్రంలో సంఘం సమావేశం బూర యాకలక్ష్మీ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంపు, ఉద్యోగ భద్రత, అర్హత కలిగిన వారిని పర్మనెంట్ చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుజ్జునూరి ప్రసాద్ కార్యదర్శిగా ఇస్లావత్‌నవీన్, కోశాధికారిగా పప్పుల ఉమ, ఉపాధ్యక్షులుగా తమ్మడపల్లె నాగయ్య, ఆరెపల్లి రాధ, సహాయ కార్యదర్శిగా చందు, గౌరవ సలహాదారులుగా రాములు, కమిటీ సభ్యులుగా యాదగిరి, రామస్వామి, గోవిందాసు ఎల్లయ్య, సతీష్, సుగుణమ్మ, అఖిల్, కుమార్, శ్రీను, దర్గయ్య, మంజుల, యాకమ్మ, ఉపేంద్రలను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న ఉపేందర్

పెన్షన్‌దారుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం



ఆందోళన చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

తొర్రూరు: పెన్షన్‌దారుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని పెన్షనర్లు, విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు పి.రాజయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటాచారిలు తెలిపారు. కేంద్రం తీసుకువస్తున్న కొత్త పెన్షన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం డివిజన్ కేంద్రంలో విశ్రాంత ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. పట్టణంలో బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త, పాత పెన్షనర్ల పేరిట వర్గీకరించి పెన్షన్ ఎగవేయడానికి కేంద్రం యత్నిస్తోందన్నారు. కొత్త పెన్షన్ స్కీం, యూనిఫైడ్ పెన్షన్ స్కీంల పేరిట దగా చేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు బందు నారాయణ, నాయకులు నాగేశ్వరరావు, చంద్రప్రకాష్, భిక్షం, మనోహరరాజు, భిక్షపతి, బొల్లం అశోక్, ఎండీ యాకూబ్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

అధికారులపై చర్య తీసుకోవాలి

- ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రమేశ్

మహబూబాబాద్: మానుకోట తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్‌ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారు కూడా గంటల తరబడి అధికారుల కోసం ఎదురు చూడాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం వస్తే అధికారులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూభారతి పేరుతో విధులకు డుమ్మా కొడుతున్నారని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రవీందర్, చాంప్లా, మల్సూర్, అంజద్, కమ్లీ, విజయ, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

శ్రావణమాస పూజలు

మహబూబాబాద్ రూరల్: శ్రావణమాస ప్రారంభాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. జిల్లా కేంద్రంలోని శ్రీమానస దేవి ఆలయ ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా శ్రీనాగులమ్మ తల్లి (మానస దేవి) అమ్మవారిని విశేషంగా అలంకరించి అర్చకులు పూజలు నిర్వహించారు.

వరలక్ష్మి పూజలు

గూడూరు: మండలంలోని నాయకపల్లి గ్రామంలోని సీతారామాలయంలో శ్రావణమాస మొదటి శుక్రవారం పురస్కరించుకొని మహిళలు వరలక్ష్మీ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శశిరేఖమ్మ, యాకలక్ష్మి, ధనలక్ష్మి, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మానుకోటలో లలితా దేవి అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

సంక్షిప్త సమాచారం

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

తొర్రూరు: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంగధారి సిద్ధు అన్నారు. ఈ మేరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వాస్, సాయి, మహేష్, కార్తీక్, రవి, శ్రీకాంత్, జగన్, మదన్, బన్నీ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలకు గురి కావొద్దు



కొత్తగూడ: రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురి కావద్దని ట్రాన్స్‌కో డీఈ విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని గుంజేడు గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అధికారులకు తెలియకుండా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజులు మార్చడానికి, మరమ్మతులు చేయడానికి యత్నించవద్దన్నారు. ఈసదస్సులో ఏఈ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు వెంటనే చేపట్టాలి

గార్ల: ఐదు రోజులుగా కురుస్తున్నందున పంచాయతీలో పేరుకుపోయిన పారిశుద్ధ్య పనులను వెంటనే చేపట్టాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు అజ్మీర వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం గార్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఎంఈఓకు సన్మానం

చిన్నగూడూరు: ఎంఈఓ ఎస్.రవికుమార్‌ను జెడ్పీహెచ్ఎస్ చిన్నగూడూరు పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రెహమాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం అభినందించారు. 2024–2025 విద్యా సంవత్సరంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యాభివృద్ధికి కృషి చేస్తూ, పది ఫలితాల్లో వందశాతం ఫలితాలను సాధించేలా ఎంఈఓ రవికుమార్ ప్రత్యేక చొరవ చూపారు.

పోగొట్టుకున్న డబ్బులు వెనక్కి..

మరిపెడ రూరల్: ఈమధ్య కాలంలో సైబర్ నేరాలలో మరిపెడ పరిధిలోని డబ్బులు పోగొట్టుకున్న బాధితులకు తిరిగి ఆ డబ్బులను అందజేసినట్లు మరిపెడ సీఐ రాజ్ కుమార్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఒక క్రైంలో రూ.13,700, మరో క్రైం ద్వారా రూ.6,821, అదేవిధంగా గతంలో ఓ షాపు యజమాని పోగొట్టుకున్న రూ.40వేలు వెనక్కు తెప్పించినట్లు సీఐ తెలిపారు. బాధితుల సమస్యలను తక్షణమే స్పందించి ఫైర్ రిజిస్టర్ చేసిన ఎస్సై సతీష్‌ను సీఐ అభినందించారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

నెల్లికుదురు: బీజేపీ మండల కమిటీని శుక్రవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా రాజ్‌కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా యాకిరెడ్డి, యుగేందర్, సురేష్, ఉపాధ్యక్షులుగా రంగాల రామచంద్రు, కుక్కల అయిలయ్య, ఆరే సురేష్, పెరుమాండ్ల ఉష, కార్యదర్శులుగా ఎండీ అరిఫా, తుప్పతూరి యాకాంబరం, మనోజ్, గుగులోతు వనిత, కోశాధికారి పత్తిపాక రంజిత్ కుమార్‌లతోపాటు కమిటీ సభ్యులను ప్రకటించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గార్ల: గార్ల మండల ఐద్వా నూతన కార్యవర్గంను శుక్రవారం గార్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐద్వా మండల అధ్యక్షురాలిగా చింత మౌనిక, ప్రధాన కార్యదర్శిగా నాగమణి, కోశాధికారిగా తాళ్లపల్లి రమలతోపాటు సభ్యులను ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి గాడిపల్లి ప్రమీల తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

బయ్యారం: పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఉప్పలపాడు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు ఉపాధ్యాయులకు సూచించారు. ఉప్పలపాడు ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మానుకోటవాసికి డీఎస్పీగా పదోన్నతి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన బొడ్డు అశోక్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం సీఐగా పనిచేస్తున్నారు. ఆయనకు డీఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది.


పాముకాటుతో మహిళా రైతుకు అస్వస్థత

మహబూబాబాద్ రూరల్: మండలంలోని మాధవాపురం గ్రామానికి చెందిన మహిళ రైతు నూకల మల్లేశ్వరీ శుక్రవారం వ్యవసాయ పనుల్లో భాగంగా తమ పత్తి చేను వద్దకు వెళ్లింది. ఆ సమయంలో పాము ఆమెను కాటు వేయగా అస్వస్థతకు గురికావడంతో వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఐసీయూకి తరలించి వైద్యం అందిస్తున్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

డోర్నకల్: మండలంలోని కస్నాతండాకు చెందిన మహిళ గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందింది. శుక్రవారం ఎస్సై గడ్డం ఉమ తెలిపిన వివరాల ప్రకారం.. కస్నాతండాకు చెందిన బానోత్ పద్మ (48) కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యింది. ఈనెల 23న ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బ్యాటరీ సైకిల్ ఇప్పించాలి



గూడూరు: చిన్నతనం నుంచి కాళ్లు లేని తనకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్యాటరీ సైకిల్ ఇప్పించాలని మండలంలోని బ్రాహ్మణపల్లి శివారు ఇప్పల్‌తండాకు చెందిన ధారావత్ విజయ అనే దివ్యాంగురాలు వేడుకుంటోంది. ధారావత్ పూలియా, రాంజీ దంపతుల కూతురు విజయ చిన్నతనం నుంచి దివ్యాంగురాలు.

ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకుందాం..

మహబూబాబాద్ అర్బన్/మరిపెడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకుందామని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుగులోతు రవినాయక్, ధారవ భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వికాస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు బనకచర్ల ప్రాజెక్ట్‌తో కలిగే నష్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దీపక్, నాయకులు బాదావత్ సురేష్, బానోతు గణేష్, శ్రీను, నరేష్, బాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవినాయక్

కోర్టు వాయిదాలకు గైర్హాజరు.. నలుగురి రిమాండ్

చిన్నగూడూరు: వేర్వేరు కేసుల్లో కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా కాలయాపన చేస్తున్న నలుగురికి తొర్రూరు కోర్టు రిమాండ్ విధించినట్లు చిన్నగూడూరు ఎస్సై ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఎస్సై వెల్లడించిన వివరాల ప్రకారం.. చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన ఎల్లవుల వీరమల్లు, బొల్లెబోయిన ఉప్పలయ్య గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన పొన్నం నరేష్, మరిపెడ మండలం వీరారం శివారు జీన్యతండాకు చెందిన ధారావత్ నరేష్ కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు తెలిపారు. శుక్రవారం నలుగురిని అరెస్టు చేసి తొర్రూరు కోర్టులో హాజరుపరచగా జడ్జి ధీరజ్ కుమార్ 14రోజులు పాటు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

బ్రిడ్జి వద్ద ఇరుక్కుపోయిన మొద్దుల తొలగింపు

బయ్యారం: మండలంలోని సుద్దరేవు–కంబాలపల్లి గ్రామాల నడుమ లోలెవల్ బ్రిడ్జి వద్ద ఇరుక్కుపోయిన మొద్దులు, చెత్తాచెదారంను శుక్రవారం జేసీబీ ద్వారా తహసీల్దార్ నాగరాజు దగ్గరుండి తొలగించారు.